# అల్లరి చెల్లాయి

శ్రీ ములుకుట్ల సుబ్రహ్మణ్యం

మా నాన్నగారు అప్పుడే ఆఫీసునుంచి వచ్చారు. ఇంట్లో అంతా చాలా గోలగా ఉంది. ఎంతసేపని ఓపికపట్టగలరెవరైనా? నేనూ, మా అమ్మ ఎంతగా ప్రయత్నించినా మా చెల్లాయి ఊర్కుంటేనా! అదే పనిగా మారాం చేస్తే, మా అమ్మ రెండు దెబ్బలు వేసింది. కాని-వున్న గోల రెట్టింపవుతుందని నేను గానీ, మా అమ్మగానీ అనుకోలేదు. ఇంటికప్పు విరిగేట్టుగా ఏడుస్తోంది చెల్లాయి. నాన్నగారు వచ్చేప్పటికున్న పరిస్థితి యిదీ!

"ఏమిటమ్మా ఇందూ; అల్లా ఏడుస్తున్నావు?" అంటూ అభిమానాన్ని వలకబోస్తూ నాన్న పలకరించారు చెల్లాయిని. చెల్లాయి అమ్మమీద కోపంవచ్చివున్న కారణంచేత, తొందరగా నాన్నదగ్గరికి పోయి-

"నా...న్నా...అమ్మ....కొట్టిందీ...ఇ...ఇ...ఇ...!" అంది.

"అమ్మెందుకు కొట్టిందమ్మా నిన్ను?" అని చిన్న చిరునవ్వుతో నాన్న ప్రశ్నించారు.

"ఉ...ఉ..." అంటూ ఏడుపే సాగించింది గాని, ఏమీ మాట్లాడలేదు చెల్లి.

అసలు అప్పుడే ఆఫీసునుంచి తిరిగొచ్చారేమో, నాన్న చాలా అలసిపోయున్నారు. చిన్న విసుగు బయటపడిందా గోల వినలేక. అమ్మ కాఫీ తీసుకొచ్చి నాన్నకిచ్చింది. చందనపు బొమ్మల్లే వళ్లో కూర్చున్న చెల్లిని రమ్మనమని చేతులు జాపింది అమ్మ.

"నీదగ్గరికి రాను పో!" అంది ఇందు.

"అమ్మదగ్గరికి పోవూ?" నాన్న అడిగారు.

"ఊహు..." అని తల అడ్డంగా ఆడించి బిగుసుకు కూర్చుంది, నాన్న ఒళ్ళోనే!

"కాఫీ అన్నా తాగక్షే!" అన్నది అమ్మ.

(52-వ పేజీ చూడండి)



## ★ భారతి చదువు ★

(34-వ పేజీ తరువాయి)

వాళ్ళం! యీ పిల్లులూ, నక్కలు ఏమిటే? నీ చదువు నీవూను—

భార : నీకేం తెలియదు పోవే! అది యింగ్లీషు !! మా మాష్టారు యింగ్లీషు అక్షరాలు వ్రాశి యిచ్చి వారం అయిందో లేదో, నాకు అప్పుడే కంఠతా వచ్చేశాయి. అందుకే యీ మాటలు వ్రాశి యిచ్చారు. సీతకు యింత వరకూ అక్షరాలే రాలేదు!

సుబ్బ : చూడు భారతీ! ఆ యింగ్లీషు అట్లా అట్టే పెట్టి ఏదన్నా తెలుగులో ఒక పద్యం చదువమ్మా?

భార : ఇంతవరకు యింగ్లీషు మాటలు అయినా కంఠతా రాందే, మధ్యలో ఏంటే నీగోల? సి-ఏ-టి... పిల్లి

సుబ్బ : తర్వాత చదువుకుందువు గానిలేవే! ఒక పద్యమేదన్నా చదవ్వే.

భార : అబ్బ! పోవే! నీ గోల నీది... మరి 'వేమన శతకం'లోవి చదవనా?

సుబ్బ : ఏదో వకటి చదువు తల్లీ.

భార : ఎలుక తోలు తెచ్చి
యాడాది వుతికినా,
నలుపు నలుపే గాని
తెలుపు రాదు,
కొయ్యబొమ్మను తెచ్చి
కొట్టినా పలుకునా
విశ్వదాభిరామ
వినుర వేమా.

సుబ్బ : ఎలుకలూ, పిల్లులూ అయాయి; యిక తోళ్లు బొమ్మలు తెచ్చావా? ఏం పద్యాలే యివి?.. నీ చదువేదో నీవు చదువుకోఅమ్మ; నాకెందుకులే మధ్య!

భార: [పుస్తకాలు ప్రక్కకు నెట్టి] అమ్మా ఆకలి వేస్తుందే. అన్నం పెట్టవే.

వెంకా : (వంట గదిలోనుంచి వస్తూ) అయిందటే నీ చదువు? ఏదో పది నిమిషాలు గోణిగావో, లేదో, అప్పుడే తిండిరంధి పట్టిందా? ఇంకా వంట కాలేదు. నే పిలుస్తా. వెళ్ళి చదువుకో!

భార : అన్నీ చదివా నే... అమ్మా...ఆకలి వేస్తుందే...అన్నం పెట్టవే!

వెంకా : వంట కాందే ఏం పెట్టనే? వెళ్ళి చదువుకో, పో![కసిరింది]

భార : [ఏడుపు ముఖం పెట్టి] ఆంధ్రభాషకు అక్షరాలు 56. అచ్చులు 16. హల్లులు 37. హ్రస్వాలు 3. అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ

రాము : ఏమిటే అక్కా అ ఆ లు చదువుతున్నావు?

భార : వ్యాకరణంరా!

రాము : దాంట్లో గూడ మళ్ళీ అ, ఆ లు వస్తాయా?

భార : నీకెందుకు పోరా... హ్రస్వాలు 3 సున్నా; అరసున్నా; విసర్గ; [నిద్రతో తూలుతూంది. బెడ్‌లాంపుకు వెంట్రుకలు అంటుకొని కమురువాసన వేస్తుంది.]

సుబ్బ : ఏమిటే? కమురువాసన వస్తుంది!...ఒసే భారతీ-మరీ వంగి చదవకే - వెంట్రుకలు కాల్తున్నట్లున్నాయి. కొంచెం వెనక్కి జరిగి తగలబడవే!

భార : [విసురుగా లేచి దీపం టేబిలుమీద పెట్టి తను వచ్చి చాపమీద పడి నిద్రపోతుంది.]

[తెర] ★

## ★ అల్లరి చెల్లాయి ★

(33 వ పేజీ తరువాయి)

"నాకు తెలుసులే!" అంది చెల్లి బింకంగా.

"పిట్ట. కొంచెం - కూత ఘనం - గయ్యాళిగంప" అంది నవ్వుతూ అమ్మ.

"నేనేం కాదు-నువ్వే గయ్యాళి గంపవి!" అని నాన్న వంక చూచింది. తనన్న మాటకు నాన్న సంతోషిస్తాడుగదా అని! కాని నాన్న తనవంక తీక్షణంగా చూచేప్పటికి కొద్దిగా భయపడింది. చివరికి నాన్న కూడా అమ్మ పక్షమే అనుకుంది గాబోలును - వెంటనే మళ్ళీ ఆలాపన ప్రారంభించేసింది. నాన్న కేం చేయాలో తోచటంలేదు! విసుగెత్తిపోతోంది.

"నిన్ను కాదు లేవే ఇందూ!" అన్నారు చెల్లాయిని ఎత్తుకొని లేచి నిల్చుంటూ.

ఆసమయంలో వృత్తిసే చూస్తూ కూర్చున్న నాకు, చెల్లాయిమీద చెడ్డకోపం వచ్చేసింది. పాపం! నాన్నగారు పగలంతా ఆఫీసులో పనిచేసి ఇంటికొస్తే, విశ్రాంతి తీసుకోడానికి వీలు లేకుండా చెల్లెలు

"అబ్బబ్బా! మాఆవిడతో పడలేక చస్తున్నానండీ."

"ఏం చేస్తుందేమి టండీ ఆవిడ?"

"అస్తమానం 'డబ్బు డబ్బు'ని వేధించుకు తింటుందండీ"

"అలాగా! ఆవిడ ఆ డబ్బంతా యేం జేస్తున్నట్లు?"

"అదేం చేస్తుందో నండీ; నాకెప్పుడూ చెప్పనూ లేదు, నేనెప్పుడూ దానికి ఇవ్వనూ లేదు"

—గోపీశ్రీ

*   *   *

డాక్టరు: "ఏం నాయనా! నీకు నొప్పి ఎక్కడ వస్తోంది?"

కుర్రవాడు: బళ్లోనండి

—శ్రీనారాయణ ప్రసాద్,
మిర్యాలగూడెం.

ఇట్లా గొడవ చేస్తుందేమిటా అనుకున్నా. పోనీ ఏదో ఒకటి, రెండు రోజులా అంటే-రోజూ ఇదేవరస!

"పడుకోబెడతా నుండండీ.... దాఅమ్మ, రా!" అంటూ మా అమ్మ చేతులు జాపింది మళ్ళీ.

"ఫో; నేను నీదగ్గరికి రాను" అంది మళ్ళీ చెల్లి.

"నేనే నిద్రపుచ్చుతాలేవే! రా అమ్మ రా!...తప్పతుందా రోజూ నాకు నీ కొలువు!" అంటూ చెల్లాయిని ఎత్తుకు లోపలికి తీసుకుపోయారు నాన్న.

ఈ భాగవతం రోజూ సాగిపోతోంది. పాపం ఏలాగో అతి కష్టం మీాద, ఓపికతో నిద్రపుచ్చివస్తారు నాన్న. ఎన్నిసార్లని ఈరకంగా చెల్లెల్ని బుజ్జగించడం?

రానురాను, గారాబాలకూచిలా తయారవుతోంది. కాకపోయినా అమ్మా నాన్నా మరీను! ఎందుకంత చనువీడం దానికి? నెత్తినెక్కక ఊర్కుంటుందా? వారు చేతులారా చేసుకున్నారో, అనుభవిస్తున్నారు. నాకు మాత్రం మహా చిరాకుగా వుంది.

మొన్నటికి మొన్న - నేను లెక్కలు చేసుకుంటూంటే చెల్లెలు అల్లరి చేసింది. కోప్పడితే ఏడుపు-అమ్మ వచ్చి నన్ను కసరడం! అట్లా చేస్తే దానికిభయభక్తులుంటాయా?

అమ్మ మెల్లిగా కుర్చీలో కూలబడింది. పాపం! అమ్మ గూడా అలసి పోయినట్లుంది. నా చిన్నతనంలో నేనిట్లా చేసుండను.... ఏమో, చేశానేమో...! తెలీదు.

చిన్న చప్పుడు గూడా లేకుండా నిశ్శబ్దంగా ఉందిగది ప్రక్కఅంతా! "అమ్మయ్య! యిప్పటికైనా శాస్త సందడి తగ్గింది. మహాతల్లి నిద్దరోయుంటుంది" అన్నది అమ్మ నిట్టూరుస్తూ. నాకూ మనస్సు తేటపడుతోంది.

చిన్నచప్పుడయింది ప్రక్కగదిలోంచి. సంతోషంతో ప్రక్కకి తిరిగిన అమ్మా, నేను యిద్దరమూ ఆశ్చర్యపోయాం! అడుగుల్లో అడుగులేసుకుంటూ చెల్లి నవ్వు లొలికిస్తూ ఆడుకుంటూ వచ్చింది మేమున్న గదిలోకి.

మమ్మల్ని చూసి "అమ్మా - నాన్న నిద్దరోయారే" అంది.

ఆ మాటలు వినటానికి ఎంత చక్కగా ఉన్నా, నవ్వాలో ఏడవాలో తేల్చుకో లేకపోయింది అమ్మ. చిన్నగా వికృతపు నవ్వు నవ్వింది అమ్మ - అంతకంటే ఏమీ చేయలేక! నా నవ్వు జతచేశా! ★


సిద్ధముగ నున్నది.

డాన్ క్విక్ సెట్

(DON QUIXOTE)



మూలం:

సెరివాన్ టెజ్

అనువాదం:

విశ్వాత్ముల నరసింహమూర్తి

తపాల ఖర్చు ప్రత్యేకం.

వెల రెండురూపాయలు

ఆంధ్ర గ్రంథమాల

మద్రాసు 1.

కౌంట్ ఆఫ్
మాంట్ క్రిస్టో

ఒక్కొక్క భాగం

వెల రూ. 3-8-0

పోస్టుఖర్చులు ప్రత్యేకం.

ఆంధ్ర గ్రంథమాల

మద్రాసు- 1